సాక్షి అన్నమయ్య జిల్లా

సోమవారం ౹ 9 ౹ డిసెంబర్ ౹ 2024



అక్రమ నిర్మాణం.. ఆపై దౌర్జన్యం

బద్వేలు పట్టణంలోని ప్రభుత్వ స్థలంలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలను అడ్డుకున్న మున్సిపల్ అధికారులపై సంబంధిత నిర్మాణదారులు దౌర్జన్యానికి దిగారు. - 8లో



వెనుకబడిన జిల్లాల అభివృద్ధికి పోరు

వెనుకబడిన రాయలసీమ, ప్రకాశం, నెల్లూరు జిల్లాల సమగ్రాభివృద్ధి కోసం ఉద్యమించాలని అఖిలపక్ష నేతలు తీర్మానించారు. ప్రత్యేక ప్యాకేజీ అందించాలని అన్నారు. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.360	రూ.440
రెండోరకం	రూ.250	రూ.340

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 98 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

రాయచోటి : ప్రజల నుంచి సమస్యలను స్వీకరించి, వాటిని పరిష్కరించేందుకు సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ ఆదివారం ప్రకటనలో పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటితోపాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

ట్రిపుల్ ఐటీలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగిపై వేటు !

వేంపల్లె : ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగిపై ఆర్జీయూకేటీ అధికారులు వేటు వేసినట్లు తెలిసింది. ఆ ఉద్యోగి ఆర్కేవ్యాలీ ట్రిపుల్ ఐటీపై యూనియన్ నాయకులతో అసత్య ఆరోపణలు చేయించడంతో ట్రిపుల్ ఐటీ అధికారులు నిజనిర్ధారణ కమిటీ వేశారు. ఆ కమిటీ విచారణ చేయగా అవి అసత్య ఆరోపణలు అని తేలింది. ఈ క్రమంలో క్రమశిక్షణ చర్యల్లో భాగంగా అతన్ని తొలగించినట్లు తెలిసింది. అలాగే క్వార్టర్స్‌లో ఉంటున్న ఇంటిని కూడా నిర్ణీత గడువులోగా ఖాళీ చేయాలని అధికారులు ఆదేశించినట్లు సమాచారం. ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు జీతాలు ఇస్తున్న ఏజెన్సీకి కూడా లేఖ పంపినట్లు తెలిసింది.

నూతన కార్యవర్గం ఏర్పాటు

వైవీయూ : గవర్నమెంట్ కాలేజ్ టీచర్స్ అసోసియేషన్ (జీసీటీఏ) నూతన కార్యవర్గం ఏర్పాటైంది. శనివారం కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాల (ఆర్ట్స్ కళాశాల)లో నూతన కార్యవర్గం ఎన్నిక నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు అధ్యాపకులు, అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొని ఎన్నుకున్నారు. పెండ్లిమర్రి ప్రభుత్వ డిగ్రీ కళాశాల రాజనీతిశాస్త్ర అధ్యాపకుడు డాక్టర్ పి.హరిప్రసాద్ పరిశీలకుడిగా, రాయచోటి ప్రభుత్వ డిగ్రీ కళాశాల జువాలజీ అధ్యాపకుడు డాక్టర్ ఎం. మునియా నాయక్ రిటర్నింగ్ అధికారులుగా వ్యవహరించారు. జీసీటీఏ నూతన అధ్యక్షుడిగా ప్రొద్దుటూరు ఎస్‌సీఎస్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆంగ్లశాఖ అధ్యాపకుడు డాక్టర్ టి.శశికాంత్ రెడ్డి, ప్రధానకార్యదర్శిగా కడప ఆర్ట్స్ కళాశాల కెమిస్ట్రీ అధ్యాపకుడు డాక్టర్ సి.నాగేశ్వరరెడ్డి, కోశాధికారిగా వేంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల కెమిస్ట్రీ అధ్యాపకుడు డాక్టర్ బి.రామకృష్ణ, మహిళా కార్యదర్శిగా ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల కంప్యూటర్ సైన్స్ అధ్యాపకురాలు డాక్టర్ సి.వి.కృష్ణవేణిలను ఎన్నుకున్నారు. వీరితోపాటు పలు పదవులకు నూతన సభ్యులను ఎన్నుకున్నారు.

ప్రశాంతంగా ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష

కడప ఎడ్యుకేషన్ : ప్రభుత్వ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు జాతీయ స్థాయి ప్రతిభ ఉపకార వేతనం(ఎన్‌ఎంఎంఎస్)- 2024 కోసం జిల్లా వ్యాప్తంగా ఆదివారం నిర్వహించి ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఇందుకోసం వైఎస్సార్ జిల్లాలోని కడప, పులివెందుల, జమ్మలమడుగు, బద్వేలు డివిజన్ల పరిధిలో 11 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా కడపలో మూడు, పులివెందుల రెండు, బద్వేలు రెండు, జమ్మలమడుగులో నాలుగు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొత్తం 2405 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా, 2281 మంది హాజరయ్యారు. 124 మంది గైర్హాజరైనట్లు ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో నాలుగు ఫ్లయింగ్ స్క్వాడ్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోలేదని పేర్కొన్నారు. విద్యార్థులంతా 9.30 గంటలకే పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారని తెలిపారు. పరీక్ష ఉదయం 10కి ప్రారంభమై 1 గంటకు ముగిసింది వివరించారు.

హ్యాండ్‌బాల్ జిల్లా జట్టు ఎంపిక

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని జిల్లా క్రీడాప్రాధికార సంస్థ మైదానంలో ఆదివారం జిల్లా స్థాయి సీనియర్ విభాగం హ్యాండ్‌బాల్ జట్టును ఎంపిక చేశారు. ఈ ఎంపిక పోటీలను జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ శివప్రసాద్, డీఎస్‌ఏ హ్యాండ్‌బాల్ శిక్షకుడు అబ్దుల్ మునాఫ్ ప్రారంభించారు. ఇందులో ప్రతిభ కనబరిచిన వారిని జిల్లా జట్టుకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు బాగా సాధన చేసి రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించాలని ఆకాంక్షించారు. ఈ నెల 13 నుంచి 15వ తేదీ వరకు అనంతపురం జిల్లా కళ్యాణదుర్గంలో నిర్వహించే రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనాల్సి ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

జిల్లా జట్టు : ఎస్.చాంద్‌బాషా, ఎం.ప్రదీప్, ఎస్.అక్బర్, సి.మల్లికార్జున, ఎస్.నరేంద్ర, ఎం.గురువర్ధన్, ఎస్.రజాక్, కె.వి.శివకుమార్, బి.కిశోర్, బి.శివ, టి.లింగ, బి.జయరాం, ఎస్.రాజు, బి.హుస్సేన్, పి.సురేంద్ర, పి.నాగరాజు.

బంగారు బాల్యం.. బాధ్యతతో పదిలం



- సెల్‌ఫోన్లతోపాటు ఇతర వ్యవహారాలతో వికృత చేష్టలు
- ఇలాగే కొనసాగితే భావి భారత పౌరుల భవితవ్యం అగమ్యగోచరం
- జిల్లాలో జరుగుతున్న వరుస ఘటనలే ప్రమాద హెచ్చరికలు
- రాయచోటిలో విద్యార్థుల చేతిలో ఉపాధ్యాయుడు హత్యపై పెదవి విరుపు
- ఇటీవలే గంజాయి మత్తులో రైలు కింద పడి ప్రాణం తీసుకున్న ఇరువురు విద్యార్థులు



సాక్షి రాయచోటి : భావి భారత పౌరులు..అలాంటి చిన్నారులు చేస్తున్న వికృత చేష్టలు సమాజం ఎటుపోతుందోనన్న సందేహాలకు సమాధానం దొరకని పరిస్థితి. బాలల భవిష్యత్తును తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఒక్క ఉపాధ్యాయులదే కాదు..సమాజంలో తల్లిదండ్రులకు కూడా ఉంటుంది. చిన్నారులు ఏం చేస్తున్నారో..ఎటు పోతున్నారో.. ఎలా వ్యవహరిస్తున్నారో చూసుకోకపోతే అనేక తప్పులకు మూల్యం చెల్లించాల్సి వస్తుంది. ఒకటి, రెండు దశాబ్దాల కిందట నాగరిక పోకడలు అంతగా లేని కాలంలో...చిన్న పిల్లలు, బాలలు తల్లిదండ్రులను అంటిపెట్టుకుని చెప్పిందే వేదంగా నడిచే పరిస్థితి ఉండేది. కాలం మారింది, కంప్యూటర్ పోకడలు పెరిగిన ప్రస్తుత కాలంలో చిన్నారులు అడిగిందే తడవుగా ఏదీ కాదనలేదన్నది ఇప్పటి పరిస్థితి. భావి భారత బాలలకు ఇది తప్పు, అది ఒప్పు అని చెప్పకపోతే భవిష్యత్‌లో ఎలాంటి తప్పుడు పనులు చేసినా అది అందరిమీద పడుతుంది. ఒకనాడు ఇంటి పని మొదలుకొని పాఠశాల ముగియగానే ఇంటికి చేరుకుని కుటుంబీకులతో తిరుగుతుండడంతో వారి ప్రవర్తన, నియమావళి తెలిసేది. ప్రస్తుతం సమాజంలో ఒకరితో ఒకరు పోటీపడుతూ ముందుకు వెళుతూ టెక్నాలజీ యుగంలో విలాసవంతానికి పోతుండడంతో అనుకోని ఘటనలు ఎదురవుతున్నాయి. అయితే మంచి తీసుకుని చెడును వదిలిస్తే పర్వాలేదు...కానీ చెడు వైపే చిన్నారులు అడుగులు పడుతుండడం ఆందోళన కలిగించే పరిణామం.

సెల్‌ఫోన్లు చూస్తున్నారంటే అప్రమత్తంగా ఉండాలి

చిన్నారులు, బాలలు (18 ఏళ్లలోపు) సెల్‌ఫోన్లు చూస్తున్నారంటే కొంచెం కనిపెట్టుకుని ఉండాలి. ఎందుకంటే ఇంటర్నెట్ ప్రపంచంలోకి వెళితే అనేక రకాల వెబ్‌సైట్లు అందుబాటులోకి వస్తాయి. పైగా సైబర్ నేరాలు పెరిగిపోయాయి. అవతలి వారు పంపిన లింక్‌పై ఒక చిన్న క్లిక్ చేస్తేనే ఖజానా ఖాళీ అవుతుంది. అదొక్కటే కాదు...అనేక రకాల అశ్లీల బొమ్మలు, లైక్‌లు, సబ్‌స్క్రైబ్‌ల కోసం రకరకాల అసత్య ప్రచారాలు జరుగుతున్న తరుణంలో చిన్నారులకు తెలియకుండా జరిగే ఒక క్లిక్‌తో ప్రమాదాన్ని కొని తెచ్చుకోవమే. దానికి తోడు గంటల తరబడి సెల్ చూస్తున్నప్పుడు ఏం చూస్తున్నారో కూడా పెద్దలు గమనిస్తూ ఉండాలి. అన్నింటి కంటే ప్రధానంగా ప్రతి ఒక్కరూ ఇన్‌స్ట్రాగామ్, వాట్సాప్‌లను క్రియేట్ చేసుకుని పెద్దలకు తెలియకుండా చూసిన తర్వాత డెలీట్ చేసి ఏమి తెలియనట్లు యదావిధిగా సెల్‌ఫోన్‌ను అందిస్తున్నారు. సెల్‌ఫోన్‌ను తగ్గించే ప్రయత్నం చేయడంతోపాటు పుస్తకాలు అలవాటు చేయడం, ఆటల ద్వారా వారిలో వినోదం పంచడం లాంటి వాటిపై దృష్టి కేంద్రీకరించాలి. ఒక్క సెల్‌ఫోనే ఎక్కువగా చూడటం ద్వారా కంటికి, చెవులకు, ముఖ వర్చస్సు తగ్గిపోవడం లాంటి అనేక రకాల సమస్యలు వేధిస్తున్నాయి.

పెరిగిన వింత పోకడలు

సమాజంలో చదువుకునే బాలల్లో వింత పోకడలు పెరిగిపోతున్నాయి. ప్రధానంగా సెల్‌ఫోన్లలో క్రైం స్టోరీలు చూడడం మొదలు ఇతర అనేక రకాల కారణాలతో విద్యార్థులు కూడా వేరే వ్యవహారాలకు బానిసలవుతున్నారు. ఒకరిని కొట్టినా, తిట్టినా శిక్ష కఠినంగా ఉంటుందన్న విషయం తెలియకనో, లేక ఏమౌతుందిలే అన్న ధీమాతో ఏదంటే అది చేస్తున్నారు. తల్లిదండ్రులు, గురువులకు తెలియకుండా రహస్య ప్రాంతాలను ఎంచుకుని సిగరెట్లు తాగడం, మత్తు పదార్థాలను అలవాటు చేసుకోవడం ఇలా చెడు మార్గాలవైపు పయనిస్తున్నారు. తల్లిదండ్రులు పిల్లల విషయంగా ప్రత్యేక శ్రద్ధ పెట్టకపోతే ప్రమాదాలను కొని తెచ్చుకోవడమే అవుతుంది. దీనికితోడు చెడు సావాసంతో అనవసరంగా వెళ్లి వివాదాల్లో చిక్కుకుని జీవితాలను నాశనం చేసుకుంటున్నారు.

కేసులతో జీవితాలు ఛిద్రం

జిల్లాలో అవసరంగా చెడు మార్గంలో పయనిస్తూ పోలీసు కేసులతో తమ జీవితాలను వారే ఛిద్రం చేసుకుంటున్నారు. రెండేళ్ల కిందట మదనపల్లె, రాజంపేట పరిధిలో మైనర్లు పలు నేరాలకు పాల్పడి కేసుల్లో ఇరుక్కున్నారు. చదువుకునే వయసులో..తెలిసీ తెలియక చేసే చిన్నపాటి తప్పులు కూడా జీవితంపై మచ్చ పడేలా చేస్తాయి. నెలన్నర కిందట పీలేరులో గంజాయి మత్తులో ఇద్దరు విద్యార్థులు రైలు కిందపడి చనిపోయిన నేపథ్యంలో పోలీసులు ప్రత్యేక చర్యలు తీసుకుంటూ చైతన్యం తీసుకొచ్చేందుకు ప్రయత్నం చేస్తున్నారు. ఇంతలోనే రాయచోటిలో మందలించిన టీచర్‌పై ముగ్గురు విద్యార్థులు చితకబాదడంతో ఉపాధ్యాయుడు మృతి చెందిన సంఘటనను తలుచుకుంటేనే గగుర్పాటు కనిపిస్తోంది. ఇలా భావి భారత పౌరులు ఆలోచన లేకుండా చేస్తున్న చర్యలు బాలల భవిష్యత్తుపై నీలినీడలు అలుముకునేలా చేస్తున్నాయి.

దండన లేని చదువులతో లోపించిన క్రమశిక్షణ



సినిమాలు, మొబైల్ ఫోన్లు, పిల్లలపై తల్లిదండ్రుల అతిప్రేమ, తోటి స్నేహితులు, పరిసరాల ప్రభావం, దండన ఉండకూడదని చెప్పే విద్యాహక్కు చట్టం వల్ల విద్యార్థులలో క్రమశిక్షణ తప్పింది. గతి తప్పిన వారిని సరి చేయడానికి ఉపాధ్యాయుల చేతిలో బెత్తం వద్దన్న సమాజం వల్ల రేపటి విద్యార్థి భవిష్యత్తు అగమ్యగోచరంగా తయారయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. విద్యార్థుల బంగారు భవిష్యత్తు కోసం ఉపాధ్యాయులు ఇచ్చే చిన్నపాటి దండనలకు తల్లిదండ్రుల సమ్మతితో పాటు ప్రభుత్వ అనుమతి కూడా అవసరం.

– మడితాటి నరసింహారెడ్డి, ప్రధానోపాధ్యాయులు, జెడ్పీ హైస్కూలు, సంబేపల్లె

పిల్లలను తల్లిదండ్రులు గమనిస్తూ ఉండాలి



తల్లిదండ్రులు పిల్లలను నిరంతరం గమనిస్తూ ఉండాలి. అలాగే పాఠశాలలో చదువుతోపాటు ఇతర కార్యకలాపాలపై నిరంతర పర్యవేక్షణ ఉండాలి. పిల్లలపై సెల్‌ఫోన్ ప్రభావం అధికంగా ఉంది. అవసరమైతే వారిపట్ల కొంతమేర కఠినంగా వ్యవహరించక తప్పదు. ముఖ్యంగా వారికి నైతిక విలువలతోపాటు భవిష్యత్తు ఉత్తమంగా తీర్చుదిద్దుకునే అంశాన్ని వివరిస్తూ ఉండాలి. – జి.చెన్నారెడ్డి, అధ్యక్షులు, ప్రజా చైతన్య సేవా సంఘం, రాయచోటి

సినిమాలు సోషల్ మీడియా ప్రభావం



విద్యార్థులలో విపరీత పోకడలకు సినిమాలు సోషల్ మీడియా అధిక ప్రభావం చూపిస్తున్నాయి. సినిమాల్లో హీరో పాత్రధారి ఉపాధ్యాయులను కించపరచడం.. హేళన చేయడం హీరోయిజంగా చూపించడం టీచర్ల పట్ల తక్కువ భావం కలిగిస్తోంది. పాఠశాల విద్యార్థులు తమ తరగతి వాట్సాప్ గ్రూపుల్లో తమను తిట్టిన ఉపాధ్యాయులపై కామెంట్స్ చేసుకుంటున్నారు.ఈ తప్పును గుర్తించకపోవడం, టీచర్ మందలిస్తే విద్యార్థుల మంచికేనన్న విషయాన్ని తల్లిదండ్రులు పిల్లలకు నేర్పించకపోవడం ప్రధాన లోపం.పిల్లలకు నైతిక విలువలు, నేర్పించకపోవడం విపరీత పోకడలకు ప్రధాన కారణం. ఆరు ఏడు తరగతుల నుంచి విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిసలు కావడం ఆందోళనకరం. విపరీత పోకడలు కలిగిన, మామూలు విద్యార్థులకు భిన్నంగా వ్యవహరించే విద్యార్థులకు పాఠశాల స్థాయిలోనే కౌన్సిలింగ్ ఇవాలి.

– డాక్టర్ రాధిక, సైక్రియాటిస్ట్, జిల్లా ఆస్పత్రి, మదనపల్లె

రాయచోటిలో శాశ్వత శాంతి నెలకొల్పేలా చర్యలు

జిల్లా ఎస్పీ వి విద్యాసాగర్ నాయుడు

రాయచోటి : అన్నమయ్య జిల్లా కేంద్రం, రాయచోటిలో అన్ని వర్గాల ప్రజలు శాంతియుతంగా జీవనం సాగించేలా శాశ్వత చర్యలు చేపడతామని జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు అభిప్రాయపడ్డారు. ఆదివారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలోని సమావేశ మందిరంలో విలేకరులతో మాట్లాడారు. ఈనెల 5వ తేదీన రాయచోటి టౌన్‌లో అయ్యప్ప స్వాముల గ్రామోత్సవం సందర్భంగా తలెత్తిన సున్నితమైన అంశాన్ని కొందరు సోషల్ మీడియా వేదికగా తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని ఎస్పీ చెప్పారు. ఆరోజు సాయంత్రం 7 నుంచి 8 గంటల సమయంలో 200 మందితో కలిసి స్వామి ఊరేగింపుగా వెళ్తున్న సమయంలో ఇరువర్గాల పెద్దలు రోడ్ల మీదకు వచ్చి ఎటువంటి అభ్యంతరాలు చెప్పలేదన్నారు. కానీ కొందరు ఆకతాయిలు అత్యుత్సాహంతో మీడియాలో రావాలనో, లేక అందరికీ తమగురించి తెలియాలనో తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేశారని ఎస్పీ పేర్కొన్నారు. అలాంటి వారిని వదిలిపెట్టమన్నారు. తర్వాత మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అధ్యక్షతన పీస్ కమిటీ సమావేశంలో ఇరు వర్గాల పెద్దలతో మాట్లాడినట్లు తెలిపారు. ఇరు వర్గాల సూచనలు, సలహాల మేరకు ఒక అవగాహనకు వచ్చామన్నారు. ఈ క్రమంలో సున్నితమైన అంశాన్ని చాలా మంది వ్యక్తులు సోషల్ మీడియా వేదికగా భక్తుల మీద దాడులు చేసినట్లు, వారు వెళ్తున్న బస్సును పగులకొట్టారని తప్పుడు కథనాలు వ్యాప్తి చేశారన్నారు. జాతీయ రహదారి కాబట్టి ప్రతి ఏడాది అయ్యప్పస్వామి భక్తులు ఈ మార్గంలో వెళ్తుంటారన్నారు. అదే క్రమంలో 5వ తేదీ రాత్రి మినీ వ్యాన్‌లో వెళ్తుండగా మసీదు దగ్గర ఆగిపోవడంతో ట్రాఫిక్ జామ్ అయిదన్నారు. మసీదు దగ్గర కొందరు మినీ వ్యాన్‌కు దారి ఇస్తూ పోలీసులకు కూడా సహకారం అందించారన్నారు. అయితే కొందరు ఆకతాయిలు బస్సుపై చేతులతో కొట్టడం వల్ల అద్దం పగిలిందన్నారు. అద్దం పగులగొట్టిన వారిని గుర్తిస్తున్నామని తెలిపారు. మా దగ్గర ఉన్న దృశ్యాలను పరీక్షించగా ఎప్పుడో జరిగిన సంఘటనలు కూడా కొన్ని కలిపేసి సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేస్తున్నారన్నారు. అలాంటి వారిని వదిలిపెట్టమని ఎస్పీ హెచ్చరించారు.



మాట్లాడుతున్న ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

అకతాయిల మాటలు నమ్మొద్దు..

రాయచోటిలో చోటుచేసుకున్న ఘటనను మతాలపేరుతో రెచ్చగొట్టే చర్యలు చేపడితే అలాంటి వారిపట్ల కఠిన చర్యలు చేపడతామని ఎస్పీ హెచ్చరించారు. ముఖ్యంగా రాజకీయంగా, ఇతర ఏ కారణాల వల్ల మత విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా కొంతమంది ఆకతాయిలు సోషల్ మీడియాలో తప్పుడు కథనాలు సృష్టిస్తున్నట్లు మా దృష్టికి వచ్చిందన్నారు. ఇప్పటికే ఇలాంటి వారిని గుర్తించామని, వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. ఆకతాయిలు మాటలు నమ్మి మోసపోవద్దని ఎస్పీ సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎం వెంకటాద్రి, రాయచోటి డీఎస్పీ ఎంఆర్ కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.


విపత్తులను ఎదుర్కొనే సైనికుడిలా ఎదగాలి



శిక్షణ పూర్తి చేసుకున్న స్కౌట్ మాస్టర్లు, గైడ్స్‌తో జిల్లా స్కౌట్ సెక్రటరీ నరసింహారెడ్డి

రాయచోటి టౌన్ : విపత్తులను ఎదుర్కొనే సైనికుడిలా ప్రతి స్కౌట్ విద్యార్థి ఎదగాలని స్కౌట్ జిల్లా సెక్రటరీ మడితాటి నరసింహారెడ్డి అన్నారు. ఆదివారం రాయచోటి –గాలివీడు రోడ్డులోని యండపల్లె వద్ద స్కౌట్ అండ్ గైడ్ కెప్టెన్లకు నిర్వహిస్తున్న బేసిక్, అడ్వాన్స్‌డ్ శిక్షణ కార్యక్రమం ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా మాట్లాడుతూ శిక్షణ పూర్తి చేసుకున్న వారు విపత్తులు సంభవించిన సమయంలో ఎలా వ్యవహరించాలి, ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి అనే విషయాల గురించి తెలియజేశారు.బేసిక్ శిక్షణలో 100 మంది అడ్వాన్స్‌డ్, 10 మంది స్కౌట్ మాస్టర్లకు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అర్చనా విద్యాసంస్థల కరస్పాండెంట్ మదన్ మోహన్‌రెడ్డి, ప్రిన్సిపల్ మౌలాలి, కళాశాల డైరెక్టర్ లక్ష్మీ, అసిస్టెంట్ స్టేట్ ఆర్గనైజింగ్ కమిషనర్ లక్ష్మీకర, ట్రెజరర్ మార్ల ఓబుల్‌రెడ్డి, ఎల్‌ఏసీలు జి. వెంకటేశ్వర్లు, శకుంతలమ్మ, శంకరమ్మ, ఏఎల్‌టీలు శివప్రసాద్, నాగరాజ గుప్తా, ప్రీ ఎల్‌టీ నాగరాజ, చినబాబు పాల్గొన్నారు.

వైభవంగా ఇస్తిమా



ఇస్తిమా కార్యక్రమానికి హాజరైన ముస్లిం సోదరులు

చిన్నమండెం : అన్నమయ్య జిల్లా రాయచోటి చిన్నమండెం పరిసర ప్రాంతంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న ఇస్తిమా వైభవంగా జరిగింది. చిన్నమండెం మండలం పరిధిలోని ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి అన్నమయ్య, వైఎస్సార్, చిత్తూరు, సత్యసాయి, నెల్లూరు జిల్లాలతో పాటు కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాల నుంచి ముస్లిం సోదరులు వేల సంఖ్యలో హాజరయ్యారు. దేశంలోని పలు ప్రాంతాల నుంచి తరలివచ్చిన మత పెద్దలు అందించిన ప్రవక్త బోధనలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఇక్కడికి వచ్చిన ముస్లిం సోదరులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పోలీసులు గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు. తాగునీరు, భోజన వసతులు, ప్రత్యేక రవాణా సౌకర్యాలను కల్పించారు.

భగవద్గీతతో వ్యక్తిత్వ వికాసం

కడప కల్చరల్ : భగవద్గీత మానవుల్లో ధర్మ నిర్వహణ ఆవశ్యకత గురించి వివరించిందని, నేటి తరానికి వ్యక్తిత్వ వికాసాన్ని నేర్పగలుగుతున్నదని ధర్మ ప్రచార పరిషత్ ప్రోగ్రాం ఎగ్జిక్యూటివ్ గోపిబాబు, శ్రీ కోదండ రామాలయ నిర్వాహకుడు దేసు వెంకటరెడ్డి అన్నారు. ఈ నెల 11న గీత జయంతిని పురస్కరించుకొని తిరుమల తిరుపతి దేవస్థానాలు, హిందూ ధర్మ ప్రచార పరిషత్ వైఎస్‌ఆర్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆదివారం భగవద్గీత శ్లోకాల కంఠస్థ పోటీలు కడపలో నిర్వహించారు. సంపూర్ణ భగవద్గీత పోటీల్లో 18 ఏళ్లలోపు వారిలో వైహెచ్‌డీఎస్ సుకృత్ (విద్యా మందిర్, కడప), ఎం.మేధాశ్రీ (శ్రీ చైతన్య, రాయచోటి) ఎస్.సాయికృతి (శ్రీ చైతన్య, ప్రొద్దుటూరు) మొదటి మూడు బహుమతులు సాధించారు. 18 ఏళ్ల పైబడిన విభాగంలో ఎస్.జ్యోతి (రాయచోటి), కోట జ్యోతి (కడప) వరుసగా ప్రథమ, ద్వితీయ బహుమతులు గెలుచుకున్నారు. గెలుపొందిన విద్యార్థిని,విద్యార్థులకు బహుమతులుగా ధార్మిక గ్రంథాలు, నగదును టీటీడీ ధర్మ ప్రచార పరిషత్ వారు అందజేశారు. ప్రోత్సహించిన ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు ధార్మిక గ్రంథాలను కానుకలుగా అందించారు.

నీట మునిగిన సగిలేరు వంతెన

- భారీగా వచ్చిన సోమశిల వెనుక జలాలు
- ఆగిన వాహనాల రాకపోకలు
- 26 గ్రామాల ప్రజలకు తిప్పలు



సగిలేరు నదిపై ఉన్న లోలెవల్ వంతెనపై చేరిన నీరు



నడుములలోతు నీటిలో నడుచుకుంటూ పొలాలకు వెళ్తున్న రైతులు

అట్లూరు : సోమశిల వెనుక జలాలు భారీగా రావడంతో.. సగిలేరు నది వంతెన నీట మునిగింది. దీంతో వాహనాల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. 26 గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. సోమశిల జలాశయంలో రోజురోజుకు నీరు అధికంగా చేరుతుండటంతో సామర్థ్యం పూర్తి స్థాయికి చేరువలో ఉంది. దీంతో అట్లూరు మండలం సగిలేరు నదిపై ఉన్న లోలెవల్ వంతెనపై ఆదివారం మూడు అడుగుల మేర చేరింది.

ఇరు వైపులా గ్రామాలు

మండల నడిబొడ్డున సగిలేరు నది ఉంది. దానికి తూర్పు భాగాన కమలకూరు, మణ్యంవారిపల్లి, మాడపూరు, కామసముద్రం, వేమలూరు, ముత్తుకూరు గ్రామ పంచాయతీలు ఉండగా, వాటిలో 26 గ్రామాలు ఉన్నాయి. పడమర భాగాన 6 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. అయితే మండల కార్యాలయాలతోపాటు పోలీస్‌స్టేషన్ సహా సగిలేరు నదికి పడమర ఉన్న మండల కేంద్రమైన అట్లూరులో ఉన్నాయి. సోమశిల జలాశయం పూర్తి సామర్థ్యం 78 టీఎంసీలు కాగా 69 టీఎంసీలు దాటితే.. సగిలేరు నది వంతెన పైకి చేరుతాయి. ప్రస్తుతం సోమశిల జలాశయంలో 74 టీఎంసీల నీరు చేరడంతో వంతెనపై మూడు అడుగుల మేర నీరు నిల్వ ఉంది. దీంతో వాహనాల రాకపోకలు నిలిచి పోయాయి.

బద్వేలు మీదుగా వెళ్లాలి

ఆరు కి.మీ. దూరంలో ఉన్న మండల కేంద్రమైన అట్లూరుకు.. 40 కిలోమీటర్ల దూరం తిరిగి బద్వేలు మీదుగా వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. సగిలేరు నదికి ఇరువైపులా కొంత మంది రైతులకు పొలాలు ఉన్నాయి. వంతెనపై నీరు చేరడంతో వెళ్లడానికి తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. కొంత మంది ప్రమాదం అని తెలిసినా నడుములలోతు నీటిలో నడుచుకుంటూ వెళ్తున్నారు. అధికారులు స్పందించి ఇప్పటికైనా హైలెవల్ వంతెన నిర్మించాలని వారు కోరుతున్నారు.

రాకపోకలకు ఇక్కట్లు



మా గ్రామం నుంచి కడపకు 40 కిలోమీటర్ల దూరం ఉంటుంది. వంతెనపై నీరు చేరడంతో బద్వేలు మీదుగా అదనంగా మరో 40 కిలోమీటర్లు తిరిగి వెళ్లాల్సి వస్తోంది. సగిలేరు నదిపై ఉన్న లోలెవల్ వంతెనతో ఈ అవస్థలు ఇంకెన్నాళ్లో మరి. – ప్రసాద్, వేమలూరు, అట్లూరు మండలం

మండల కార్యాలయాలకు వెళ్లాలంటే..



మండల కేంద్రం అట్లూరులోని మండల కార్యాలయాలకు వెళ్లాలంటే రూ.10తో ఆటోకు వెళ్లే వాళ్లం. ఇప్పుడు బద్వేలు మీదుగా వంద రూపాయలు ఖర్చు పెట్టి వెళ్లాల్సి వస్తోంది. అదనపు ఖర్చుతోపాటు ఒక రోజు సమయం అంతా వృథా అవుతుంది. – విష్ణువర్ధన్, వేమలూరు, అట్లూరు మండలం

అందరికీ అవస్థలు



ఎవరికైనా అనారోగ్య సమస్య తలెత్తితే 108 వాహనం మండల కేంద్రం నుంచి 10 లేదా 15 నిమిషాల్లో వచ్చేది. ఇప్పుడు బద్వేలు మీదుగా తిరిగి రావాల్సి వస్తుండటంతో.. గంట నుంచి రెండు గంటల సమయం పడుతుంది. ఈ కష్టాలు తీరాలంటే హైలెవల్ వంతెన నిర్మించాలి. – రాజోలు సుబ్బారెడ్డి, మండల ఉపాధ్యక్షుడు, కామసముద్రం, అట్లూరు మండలం

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో 11 మందికి గాయాలు


గుర్తు తెలియని వాహనం ఢీకొని తీవ్రంగా గాయపడిన వెంకటరమణ

మదనపల్లె : వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో 11 మంది గాయపడి, మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. బెంగళూరుకు చెందిన కొంతమంది సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, స్నేహితుడి వివాహానికి హాజరయ్యేందుకు శనివారం రాత్రి మదనపల్లెకు కారులో వచ్చారు. ఆదివారం తెల్లవారుజామున వివాహం చూసుకుని, తిరుగుప్రయాణమయ్యారు. మార్గమధ్యంలో మదనపల్లె బైపాస్‌రోడ్ రాయల్‌ఉడ్ ఫర్నీచర్ సమీపంలో కర్నూల్ జిల్లా పామిడి నుంచి చెన్నైకు టమాటాలు తరలిస్తున్న బొలెరో వాహనం వీరి కారును ఢీకొంది. ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న బెంగళూరు టిన్‌ఫ్యాక్టరీకి చెందిన హాఫీజ్(28), మదనపల్లె ఎస్వీఆర్ లేఔట్‌కు చెందిన గణేష్(28), ఎస్బీఐ కాలనీకి చెందిన చంద్రశేఖర్(28), వేంపల్లెకు చెందిన సోమశేఖర్‌రెడ్డి(28), నంద్యాల జిల్లా ఆళ్లగడ్డకు చెందిన అనిల్‌కుమార్‌రెడ్డి(29)తో పాటు డోన్‌కు చెందిన బొలేరో వాహన డ్రైవర్ సురేంద్ర(27) గాయపడ్డారు. వీరిలో గణేష్, చంద్రశేఖర్, సురేంద్రలు స్వల్పంగా గాయపడగా, మిగిలిన వారు తీవ్రంగా గాయపడ్డారు. తీవ్రంగా గాయపడిన వారిని మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తరలించారు. ఘటనపై టూటౌన్ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

కుమార్తె పరీక్ష కోసం వస్తూ..

■ 1పెద్దమండ్యంకు చెందిన దంపతులు చాంద్‌బాషా(40), ఫరీదా(38) తమ కుమార్తె ఫర్హాన్‌కు మదనపల్లెలో ఎస్ఎంఎంఎస్ పరీక్ష ఉండటంతో సొంత ఆటోలో బయలుదేరారు. మార్గమధ్యంలోని కలిచెర్ల వద్ద ఆటో అదుపుతప్పి బోల్తా పడటంతో చాంద్‌బాషా, ఫరీదా తీవ్రంగా గాయపడ్డారు. ఫర్హాన్‌కు ఎలాంటి గాయాలు కాకపోవడంతో స్థానికుల సహాయంతో బాధితులు మదనపల్లెకు చేరుకున్నారు. విద్యార్థిని పరీక్షకు హాజరుకాగా, తల్లిదండ్రులు జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందారు.

■ కురబలకోట మండలం మట్టివారిపల్లెకు చెందిన వెంకటరమణారెడ్డి(65) వ్యక్తిగత పనులపై ద్విచక్రవాహనంలో ఆదివారం మదనపల్లెకు వస్తుండగా, మార్గమధ్యంలోని ముదివేడు టోల్‌ప్లాజా వద్ద మరో ద్విచక్రవాహనం ఢీకొంది. దీంతో తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు బాధితుడిని మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

■ బసినికొండ వడ్డిపల్లెకు చెందిన రెడ్డెప్ప కుమారుడు జగన్(21) స్థానికంగా ట్రాక్టర్ కూలి పనులకు వెళ్లేవాడు. యథావిధిగా ఆదివారం ట్రాక్టర్‌లో కూలి పనులకు వెళుతుండగా, మార్గమధ్యంలోని బసినికొండ సమీపంలో ట్రాక్టర్ స్పీడ్ బ్రేకర్ దాటే సమయంలో అదుపుతప్పి ట్రాక్టర్ నుంచి కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

■ పుంగనూరు మండలం ఈడిగపల్లె పంచాయతీ దిగువకొండమీదపల్లెకు చెందిన రాజన్న కుమారుడు వెంకటరమణ(60) వ్యక్తిగత పనులపై ద్విచక్రవాహనంలో చెంబకూరుకు వెళుతుండగా, మార్గమధ్యంలో ఎదురుగా వచ్చిన ద్విచక్రవాహనం ఢీకొంది. దీంతో తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు బాధితులను మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు. ఆయా ఘటనలపై సంబంధిత పోలీసులు విచారణ చేస్తున్నారు.

కామధేను జాతీయ పురస్కారం ప్రదానం


పురస్కారం అందుకుంటున్న ప్రభాకర్

ప్రొద్దుటూరు కల్చరల్ : పట్టణానికి చెందిన రచయిత, పరిశోధకుడు డాక్టర్ ఎం.ప్రభాకర్ రచనా రంగంలో విశ్వగురు వరల్డ్ రికార్డ్స్ కామధేను జాతీయ పురస్కారం అందుకున్నారు. ఆదివారం హైదరాబాదులో టూరిజం ప్లాజాలో జరిగిన వేడుకలో సంస్థ సీఈఓ సత్యవోలు రాంబాబు, తెలంగాణ హైకోర్టు జడ్జి సూరెపల్లి నంద, సంగీత దర్శకురాలు శ్రీలేఖ, ఆయుర్వేద కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సారంగపాణి తదితర ప్రముఖుల సమక్షంలో ఈ పురస్కారాన్ని అందుకున్నారు. ఈయన జననం–జీవనం–మరణం, అయోధ్య, కాశీ రహస్యం తదితర పుస్తకాలు రచించారు.

క్లుప్తంగా

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి


నిర్మలాదేవి

రాజంపేట : పట్టణంలోని సాయినగర్‌లో నివసిస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయుడు నాగేశ్వరరావు నాయక్ భార్య నిర్మలాదేవి(51) ఆదివారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. దీనిపై మన్నూరు పోలీసులు కేసు నమోదు చేశారు. మహిళ హత్యకు గురైందంటూ ప్రచారం జరిగింది. దీంతో డీఎస్పీ సుధాకర్ ఆదేశాల మేరకు సంఘటన స్థలానికి సీఐ యల్లమరాజు, ఎస్ఐ ప్రసాద్‌రెడ్డి చేరుకుని మతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని సంబంధీకులకు అప్పగించారు.

ఉరివేసుకుని ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : కుటుంబ సమస్యలతో ఓ వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్యకు యత్నించిన ఘటన శనివారం రాత్రి మదనపల్లెలో జరిగింది. సీటీఎం రోడ్డు ఎస్టేట్ ప్రాంతానికి చెందిన ఖలందర్(30) కుటుంబ సమస్యలతో ఇంట్లో ఘర్షణ పడి ఉరివేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే బాధితుడిని స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. అయితే అత్యవసర విభాగంలో చికిత్స అందించిన అనంతరం పరిస్థితి విషమంగా ఉండటంతో తిరుపతికి రెఫర్ చేశారు.

ప్రమాదవశాత్తు నీట మునిగి వ్యక్తి మృతి


షఫీవుల్లా (ఫైల్)

కేవీపల్లె : ప్రమాదవశాత్తు నీటమునిగి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని అడవిపల్లె రిజర్వాయర్‌లో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. చిత్తూరు జిల్లా పులిచెర్ల మండలం తురకపేటకు చెందిన మొహమ్మద్ షఫీవుల్లా (43) ఆదివారం తన కుటుంబ సభ్యులతో సరదాగా అడవిపల్లె రిజర్వాయర్ చూసేందుకు వెళ్లారు. షఫీవుల్లా ప్రమాదవశాత్తు అడవిపల్లె రిజర్వాయర్ నీటిలో పడ్డాడు. కుటుంబ సభ్యులు గట్టిగా కేకలు వేయడంతో గమనించిన స్థానికులు షఫీవుల్లాను వెలికి తీసి చికిత్స నిమిత్తం పీలేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిశీలించిన వైద్యులు అప్పటికే అతను మృతి చెందినట్లు నిర్ధారించారు. ఎస్ఐ చిన్నరెడ్డెప్ప కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వైవీయూ ఆచార్యుడికి సాహిత్య పురస్కారం

వైవీయూ : యోగి వేమన విశ్వవిద్యాలయం తెలుగు శాఖ ఆచార్యులు డాక్టర్ ఎన్.ఈశ్వరరెడ్డికి 'తుమ్మల వెంకట్రామయ్య' సాహిత్య పురస్కారం దక్కింది. గుంటూరులో నిర్వహించిన పుస్తక ప్రదర్శన ప్రాంగణంలో అభ్యుదయ రచయితల సంఘం(అరసం) ఆధ్వర్యంలో ఆదివారం ఈ పురస్కారాన్ని ప్రదానం చేశారు. అరసం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ అభ్యుదయ రచయితల సంఘం ఏర్పాటులో తుమ్మల వెంకట్రామయ్య నిర్మాణాత్మక పాత్ర పోషించారన్నారు. అలాంటి రచయిత పేరు మీద ఏర్పాటు చేసిన పురస్కారాన్ని ఆచార్య ఎన్.ఈశ్వరరెడ్డికి ఇవ్వడం సముచితమని పేర్కొన్నారు. పురస్కార గ్రహీత ఆచార్య ఎన్.ఈశ్వరరెడ్డి మాట్లాడుతూ అభ్యుదయ గేయాలు ప్రజలకు చైతన్య వీచికలుగా నిలుస్తూ అజరామరంగా ఉంటాయన్నారు. ఈ సందర్భంగా పలువురు ఆచార్య ఎన్.ఈశ్వరరెడ్డిని అభినందించారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య


మృతి చెందిన శివన్న

బి.కొత్తకోట : వ్యవసాయం కోసం చేసిన అప్పులు తీర్చే దారి లేక ఓ రైతు ఆత్మహత్యాయత్నం చేయగా శనివారం రాత్రి మృతి చెందాడు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బి.కొత్తకోట మండలం గుమ్మసముద్రం పంచాయతీ వడిగలవారిపల్లికి చెందిన రైతు వడిగల శివన్న (61) వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నాడు. పంటల కోసం రూ.5 లక్షల వరకు అప్పులు చేశాడు. ఈ అప్పులు ఎలా చెల్లించాలని తెలియక మనోవేదనకు గురవుతూ ఉండేవాడు. ఈ నేపథ్యంలో ఈ నెల 5వ తేదీ మధ్యాహ్నం శివన్న ఇంటి వద్ద విషద్రావణం తాగి ఆత్మహత్యకు యత్నించాడు. వెంటనే కుటుంబీకులు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో తిరుపతికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. ఆదివారం భార్య ఈశ్వరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. ఇలా ఉండగా కొన్ని రోజుల క్రితం కొత్తపల్లె సమీపంలోని పొలాల్లో 13 నాటు బాంబులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రెండు నాటు బాంబులు పేలి రెండు ఆవులకు తీవ్ర గాయాలయ్యాయి. నాటు బాంబులు స్వాధీనం చేసుకున్న పొలం శివన్నది కావడం స్థానికుల్లో చర్చనీయాంశమైంది.

ఖాళీ స్థలం కనబడితే కబ్జానే

- ఎక్కడ పడితే అక్కడ ఆక్రమణలకు పాల్పడుతున్న టీడీపీ నేతలు
- జేసీబీ, ట్రాక్టర్లు పెట్టి గుట్టలను చదును చేస్తున్న వైనం


టీడీపీ నేత చదును చేసిన ప్రభుత్వ భూమి

వేంపల్లె : కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే టీడీపీ నేతలు రోజురోజుకు రెచ్చిపోతున్నారు. మమ్మల్ని ఎవరూ ఏమీ చేయరనే అధికార దర్పంతో ప్రభుత్వ భూముల్ని కూడా వదలకుండా కబ్జా చేస్తున్నారు. మండల వ్యాప్తంగా ఎక్కడ ఖాళీ స్థలం కనపడినా కబ్జా చేసేందుకు వెనుకాడడం లేదు. ఆదివారం అధికారులు ఎవరూ ఉండరనే ధైర్యంతో మండలంలోని పాములూరుగుట్ట సమీపంలోని 10 ఎకరాల ప్రభుత్వ భూమి గుట్టను చదును చేసి మట్టిని తోలే ప్రయత్నం చేశారు. టీడీపీ జిల్లా యువత మాజీ కార్యదర్శి ఎద్దుల శేషారెడ్డి ప్రభుత్వ భూమిని కబ్జా చేసేందుకు తెర లేపాడు. జేసీబీ, టాక్టర్లు పెట్టి గుంతలకు మట్టి తోలి చదును చేస్తున్న క్రమంలో స్థానికులు గమనించి తహసీల్దార్ హరినాథ్‌రెడ్డికి సమాచారం అందించారు. దీంతో ఆయన తన సిబ్బందిని సంఘటన స్థలానికి పంపించి జేసీబీ, ట్రాక్టర్లను వెనక్కి పంపించారు. అయితే టీడీపీ నేత ఒక సర్వే నంబర్ చెప్పి గత 20 ఏళ్లుగా భూమి తన అనుభవంలో ఉందని చెప్పారు. కాగా రెవెన్యూ సిబ్బంది అతను చెప్పిన సర్వే నంబర్ ప్రకారం చదును చేస్తున్న భూమిని పరిశీలించగా రెవెన్యూ రికార్డుల్లో ఎలాంటి అనుభవంలో లేదని తేల్చి చెప్పడంతో మిన్నకుండిపోయాడు. ఈ విషయంపై తహసీల్దార్ హరినాథ్‌రెడ్డిని వివరణ కోరగా చదును చేస్తున్న భూమి ప్రభుత్వ భూమి అని అతనిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కాగా టీడీపీ నేతలు ఇష్టారాజ్యంగా పాపాగ్ని నదిలో ఇసుకను, గ్రావెల్ మట్టిని తరలిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు.

అసలే అక్రమ నిర్మాణం ... ఆపై అధికారులపై దౌర్జన్యం


అక్రమ నిర్మాణాలను తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

సాక్షి టాస్క్‌ఫోర్స్ : వైఎస్సార్ జిల్లా బద్వేలు పట్టణం శివాలయం రోడ్డులోని రాధాకృష్ణనగర్ సమీపంలో గల 855 సర్వే నంబరులో ఉన్న ప్రభుత్వ స్థలం, సందు రస్తాలో ఆదివారం జరుగుతున్న అక్రమ నిర్మాణాలను అడ్డుకున్న మున్సిపల్ అధికారులపై సంబంధిత నిర్మాణదారులు దౌర్జన్యానికి దిగారు. ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపట్టరాదని సూచించిన అధికారులపైనే పోలీసులకు ఫిర్యాదు చేయడం గమనార్హం. ఇందుకు సంబంధించి వివరాల్లోకి వెళితే.. బద్వేలు పట్టణంలోని శివాలయం రోడ్డులో గల 855 సర్వే నంబరులో గత కొన్నేళ్లుగా ఓ ప్రభుత్వ స్థలంలో వివాదం నడుస్తోంది. రాధాకృష్ణనగర్‌కు సమీపంలోని అధికార పార్టీకి చెందిన శ్రీధర్‌నాయుడు అనే వ్యక్తి ఇటీవల సదరు ప్రభుత్వ స్థలాన్ని రమణారెడ్డి అనే వ్యక్తికి విక్రయించాడు. సుమారు 20 రోజుల క్రితం ఈ ప్రభుత్వ స్థలంలో ఇంటి నిర్మాణ పనులు చేపట్టగా స్థానికులు అడ్డుకోవడంతో పాటు రెవెన్యూ, మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో రెవెన్యూ, మున్సిపల్, పోలీసు సిబ్బంది ఘటన స్థలానికి వెళ్లి పనులను నిలుపుదల చేయించారు. అయితే శుక్ర, శనివారాల్లో తిరిగి ప్రభుత్వ స్థలంలో నిర్మాణాలు చేపట్టగా స్థానికులు ఆర్డీఓకు ఫిర్యాదు చేయడంతో ఆయన ఆదేశాల మేరకు మున్సిపల్ కమిషనర్, పట్టణ ప్రణాళిక అధికారులు, గోపవరం రెవెన్యూ సర్వేయర్ తదితరులు సంబంధిత స్థలం వద్దకు వెళ్లారు. భూ యాజమాన్య హక్కు పత్రాలు చూపించి అన్ని సక్రమంగా ఉంటే పురపాలక సంఘం నిబంధనల ప్రకారం ప్లాన్ అప్రూవల్ పొంది నిర్మాణాలు చేపట్టుకోవచ్చని, అంత వరకు తాత్కాలికంగా పనులు నిలుపుదల చేయాలని సూచించారు. దీంతో పనులు నిలుపుదల చేసిన నిర్మాణదారులు తిరిగి ఆదివారం పనులు మొదలుపెట్టారు. దీంతో మున్సిపల్ అధికారులు, సిబ్బంది వెళ్లి స్థల వివాదం కోర్టులో ఉండటంతో పాటు నిర్మాణాలు అక్రమమని తేలడంతో ఆక్రమిత కట్టడాలను పాక్షికంగా తొలగించారు. దీంతో కోపోద్రిక్తులైన నిర్మాణదారులు మున్సిపల్ అధికారులతో వాగ్వాదానికి దిగారు. అంతటితో ఆగకుండా మున్సిపల్ కమిషనర్, సిబ్బందిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అక్రమ నిర్మాణాలను ఉపేక్షించం



మున్సిపాలిటీ పరిధిలో ప్రభుత్వ భూములు ఆక్రమించి నిర్మాణాలు చేపట్టినా, సొంత స్థలాల్లో అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపట్టినా మున్సిపల్ యాక్ట్ ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. తప్పనిసరిగా నిబంధనల ప్రకారం ప్లాన్ అప్రూవల్ పొందిన తర్వాతే నిర్మాణాలు చేపట్టాలి.

వి.వి.నరసింహారెడ్డి, మున్సిపల్ కమిషనర్

'సీమ' అభివృద్ధే లక్ష్యంగా ఆర్‌సీపీ ఆవిర్భావం


కడప సెవెన్‌రోడ్స్ : సీపీఎం నుంచి విడిపోయిన కొందరు నాయకులు రాయలసీమ ప్రాంత అభివృద్ధే లక్ష్యంగా రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ(ఆర్‌సీపీ)ని ఏర్పాటు చేసి సోమవారానికి 9 సంవత్సరాలు పూర్తవుతోంది. ఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శిగా ఎన్.రవిశంకర్‌రెడ్డి వ్యవహరిస్తున్నారు. పార్టీ ఆవిర్భవించిన తర్వాత మొట్టమొదటి కార్యక్రమంగా విభజన హామీల్లో భాగమైన కడప స్టీల్ ప్లాంటు సెయిల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయాలని కోటిరెడ్డిసర్కిల్ వద్ద 360 రోజులపాటు రిలే నిరాహార దీక్షలు నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రతి 50 రోజులకు ఒకసారి ఒక పెద్ద కార్యక్రమాన్నినిర్వహిస్తూ వచ్చారు. జిల్లా పరిషత్ ఎదురుగా ఏర్పాటు చేసిన భారీ బహిరంగసభలో నాటి లోక్‌సభ సభ్యుడు వైఎస్ అవినాష్‌రెడ్డి, మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ వంటి ప్రముఖ నాయకులు పాల్గొన్నారు. కడప ఉక్కు–రాయలసీమ హక్కు అనే నినాదంతో మండల తహసీల్దార్ కార్యాలయం మొదలుకొని గవర్నర్ వరకు వినతిపత్రాలు ఇచ్చే కార్యక్రమాన్ని చేపట్టారు. దీంతో నాటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కడపకు వచ్చిన సందర్భంలో ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తామని హామీ ఇవ్వడంతో దీక్షలు విరమించారు. రాయలసీమలో హైకోర్టు ఏర్పాటు చేయాలన్న డిమాండుతో సుమారు 1200 కిలోమీటర్ల బైక్ ర్యాలీలు నిర్వహించారు. అనంతపురం జిల్లా భైరవానితిప్ప ప్రాజెక్టు కోసం పాదయాత్రలు, సెంట్రల్ యూనివర్సిటీ కోసం నిరాహార దీక్షలతోపాటు స్థానిక సమస్యలపై పోరాటాలు నిర్వహించినట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్‌రెడ్డి వివరించారు. సోమవారం పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు.

వ్యక్తి అదృశ్యం


విజయకుమార్ (ఫైల్)

కడప అర్బన్ : కడప నగరం చిన్నచౌక్ పోలీస్ స్టేషన్ పరిధిలో అశోక్‌నగర్‌లో నివాసం ఉంటున్న నల్లబల్లి విజయకుమార్ (45) ఈనెల 7వ తేదీ రాత్రి ఇంటి వద్ద సెల్‌ఫోన్, మోటార్ సైకిల్ పెట్టి ఎటో వెళ్లిపోయాడు. అతని కోసం భార్య జగదీశ్వరి, కుమారులు ఉదయ్‌కిరణ్, కళ్యాణ్‌కుమార్‌లు చుట్టు పక్కలా వెతికారు. చిన్నచౌక్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎన్. రాజరాజేశ్వర్‌రెడ్డి తెలిపారు. అతని ఆచూకీ తెలిసిన వారు సీఐ సెల్: 9121100520కుగానీ, ఎస్ఐలు–9121100520, 9121100521కు సమాచారం ఇవ్వాలని కోరారు.

గుర్తు తెలియని మహిళ మృతి



కడప అర్బన్ : కడప రిమ్స్‌లో గుర్తు తెలియని మహిళ మృతి చెందింది. ముక్కరమ్మ (28) పేరుతో ఓ మహిళ ఆసుపత్రిలో అడ్మిట్ అయింది. తలకు గాయం కావడంతో పాటు టీబీ వ్యాధితో బాధపడుతూ చికిత్స పొందుతోంది. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం మృతి చెందింది. మృతురాలి వివరాలు తెలిసిన వారు తమను సంప్రదించాలని రిమ్స్ అధికారులు కోరారు.

వెనుకబడిన జిల్లాల అభివృద్ధికి పోరుబాట


సంఘీభావం వ్యక్తం చేస్తున్న అఖిలపక్ష నాయకులు


కడప సెవెన్‌రోడ్స్ : వెనుకబడిన రాయలసీమ, ప్రకాశం, నెల్లూరు జిల్లాల సమగ్రాభివృద్ధి కోసం ఎవరు అధికారంలో ఉన్నా ఉద్యమించాలని అఖిలపక్ష నేతలు తీర్మానించారు. ఆదివారం నగరంలోని ఇంజినీర్స్ భవనంలో కన్వీనర్ నారాయణ అధ్యక్షతన సదస్సు జరిగింది. రాయలసీమ సాగునీటి సాధన సమితి నాయకులు బొజ్జా దశరథరామిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో రాయలసీమ 42 శాతం భూభాగం కలిగి ఉన్నప్పటికీ 21 శాతం భూభాగానికే ప్రాజెక్టులు నిర్మిస్తున్నా కేవలం 9 శాతానికే నీటిపారుదల సౌకర్యం ఉందన్నారు. 20 లక్షల ఎకరాలకు నీరందాల్సి ఉండగా, ఏటా 5 నుంచి 7 లక్షల ఎకరాలకు కూడా నీరు వాడుకోలేని పరిస్థితి రాయలసీమలో నెలకొందని తెలిపారు. కృష్ణా, తుంగభద్ర నదుల్లో వంద రోజుల ప్రవాహం ఉన్నప్పటికీ శ్రీశైలంలో నిరంతరం విద్యుత్ ఉత్పాదన చేపడుతూ నీటిని దిగువకు వదిలేస్తున్నారన్నారు. పోలవరం నిర్మిస్తే రాయలసీమకు ఏమి లబ్ధి జరుగుతుందో ముఖ్యమంత్రి తమతో చర్చించాలన్నారు. కృష్ణా, డెల్టా వాడుకోవాల్సిన నీటిని సముద్రంపాలు చేస్తూ రాయలసీమ, నెల్లూరు, ప్రకాశం జిల్లాకు రావాల్సిన నీటిని కృష్ణా డెల్టాకు తరలిస్తున్నారని ఆరోపించారు. అలగనూరు, అన్నమయ్య ప్రాజెక్టులు కొట్టుకుపోయినా ఈ ఆరు నెలల కాలంలో చంద్రబాబు ప్రభుత్వం వాటి పునరుద్ధరణకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు. మైలవరం నుంచి ఏటా 10 వేల క్యూసెక్కుల నీరు పెన్నాలోకి వృథాగా వదిలేస్తున్నారని తెలిపారు. రాయలసీమకు సాగునీరు అందాలంటే శ్రీశైలం ఎండీడీఎల్ 854 అడుగులు ఉండాలని, కానీ 834 అడుగులకు కుదిస్తూ జీఓ నంబర్. 69 జారీ చేయడం అన్యాయమన్నారు. సిద్దేశ్వరం అలుగు నిర్మాణాన్ని చేపట్టాలని డిమాండ్ చేశారు. గుండ్రేవుల రిజర్వాయర్ నిర్మించి తద్వారా కేసీ కెనాల్ స్థిరీకరణ, హెచ్ఎన్ఎస్ఎస్ ద్వారా అనంతపురానికి నీరు ఇవ్వాలన్నారు. బడ్జెట్‌లో రాయలసీమ నీటి ప్రాజెక్టులకు 42 శాతం నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం శ్రీబాగ్ ఒప్పందాన్ని గౌరవిస్తూ ఏర్పాటు చేసిన ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ అథారిటీ, లా యూనివర్సిటీ, ఉర్దూ యూనివర్సిటీ, లోకాయుక్త, మానవ హక్కుల కమిషన్, కొప్పర్తి ఎంఎస్ఎంఈ టెక్నాలజీ సెంటర్‌ను అమరావతికి తరలించడమంటే రాయలసీమ ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడమేనన్నారు. కన్వీనర్ నారాయణరెడ్డి మాట్లాడుతూ కడప స్టీల్‌ప్లాంటును ప్రభుత్వం విస్మరిస్తోందని దుయ్యబట్టారు. పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ ఎన్.తులసిరెడ్డి మాట్లాడుతూ రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాలకు బుందేల్‌ఖండ్ తరహా ప్యాకేజీ అందించాలన్నారు. వెలిగొండ సాధన సమితి నాయకులు మాలకొండారెడ్డి, అనంతపురం రైతు నాయకుడు పెద్దిరెడ్డి, ఓపీడీఆర్ నాయకుడు శ్రీనివాసులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు కుమార్‌రెడ్డి, డాక్టర్ ఎం.శ్యాంప్రసాద్, గోపాల్‌రెడ్డి, బైరెడ్డి రామకృష్ణారెడ్డి, జాలా జయవర్ధన్, సుబ్బరాయుడు, అఖిలపక్ష కమిటీ జిల్లా కన్వీనర్ సీఆర్‌వీ ప్రసాద్‌రావు పాల్గొన్నారు.

రైలు కింద పడి వ్యక్తికి తీవ్ర గాయాలు


గాయపడిన వ్యక్తిని ఆస్పత్రికి తరలిస్తున్న రైల్వే పోలీసులు

ఎర్రగుంట్ల : రైలులో ఉన్న ప్రయాణికులకు భోజనం ప్యాకెట్ అందిస్తుండగా ప్రమాదవశాత్తు రైలు కింద పడి హోటల్ నిర్వాహకుడు కందుకూరు వెంకట సంజీవ ప్రసాద్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు ఇలా.. వెంకట సంజీవప్రసాద్ ఎర్రగుంట్ల మెయిన్ బజార్‌లోని రైల్వే స్టేషన్ దగ్గరలో హోటల్ నడుపుకుంటూ జీవనం సాగించేవాడు. రైలు ప్రయాణికులు ఎవరైనా ఫోన్ చేసి భోజనం పార్సిల్ పంపించమని అడిగితే సంబంధిత రైలు వద్దకు వెళ్లి పార్సిల్ అందిస్తుంటాడు. ఈ క్రమంలో ఆదివారం భోజనం ప్యాకెట్ ఇవ్వడానికి ఎర్రగుంట్ల రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫారంపైకి వెళ్లాడు. కన్యాకుమారి రైలు రాగా అందులో ఉన్న ప్రయాణికుడికి భోజనం ప్యాకెట్ అందిస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు అతను ప్లాట్‌ఫాం–రైలు మధ్యలో కింద పడిపోయాడు. ఈ ఘటనలో అతని ఎడమ చెయ్యి పూర్తిగా తెగిపోవడంతో పాటు కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే చికిత్స నిమిత్తం 108 వాహనంలో ప్రొద్దుటూరు జిల్లా ఆస్పత్రికి తరలించారు.

రాజోలికి నిధులు కేటాయించాలి


మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్

మైదుకూరు : కడప జిల్లా రైతులకు మేలు కలిగించే రాజోలి ఆనకట్టకు నిధులు కేటాయించి వెంటనే పూర్తి చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. మైదుకూరులో ఆదివారం సీపీఎం మండల 3వ మహాసభలు షేక్ షాబీర, టి.గురయ్య అధ్యక్షతన జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైదుకూరు నియోజకవర్గంలో మూడు మండలాలకు సాగు, తాగునీరు అందించే రాజోలి రిజర్వాయర్ నిర్మాణం శిలాఫలకానికే పరిమితమైందన్నారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు వి.అన్వేష్, మైదుకూరు మండల కార్యదర్శి ఎస్.షరీఫ్, మండల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రహదారులపై రక్తపుటేరులు

- జాతీయ రహదారులపై మృత్యు ఘంటికలు
- ఓవర్‌లోడుతో తరచూ ప్రమాదాలు
- రోడ్డు ప్రమాదాల్లో నాలుగేళ్లలో 1316 మంది మృత్యువాత
- వేగం తగ్గిస్తే ప్రమాదాలు అరికట్టవచ్చంటున్న అధికారులు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : ఈ ఏడాది ఆగస్టు 26న చక్రాయపేట మండలం వడ్డెపల్లెకు చెందిన సత్యనారాయణ అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో అతని భార్య, బంధువులు పెద్దకర్మ చేసుకొని బంధువుల ఇంట్లో దీపం చూసేందుకు బయలుదేరారు. వారు ప్రయాణిస్తున్న కారును గువ్వలచెరువు ఘాట్‌లో లారీ ఢీకొనడంతో ఐదుగురు మృతి చెందారు.

■ నవంబరు 24న కాశినాయన మండలం చిన్నాయపల్లెకు చెందిన ఒకే కుటుంబం వారు బంధువుల నూతన గృహప్రవేశ వేడుకల్లో పాల్గొనేందుకు ద్విచక్ర వాహనంలో వెళ్తున్నారు. వారి వాహనాన్ని ముదిరెడ్డిపల్లె సమీపంలో వెనుక నుంచి లారీ ఢీకొనడంతో ముగ్గురు మృతి చెందారు. లారీ అతి వేగమే ప్రమాదానికి కారణమని తెలిసింది.

ఇలా నిత్యం ఏదో ఒక మూలన రోడ్డు ప్రమాదం జరుగుతూనే ఉంది. ఫలితంగా జిల్లాలో రహదారులు రక్తంతో తడిసి ముద్దవుతున్నాయి. ఆటోలు, ద్విచక్ర వాహనాలు కూడా శ్రుతిమించిన వేగంతో వెళుతుండటంతో ఊహించని ఘటనలకు దారి తీస్తున్నాయి.

అతివేగం.. ఓవర్ లోడుతోనే..

రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువగా ద్విచక్ర వాహనదారులే మృతి చెందుతున్నారు. దీనికి కారణం అతి వేగమేనని అధికారులు నిర్ధారించారు. అధిక సామర్థ్యం కలిగిన ద్విచక్రవాహనాల్లో 140 నుంచి 170 కిలోమీటర్ల వేగంతో వెళుతుండటంతో అదుపు తప్పి ప్రమాదాల బారిన పడుతున్నారు. ఆటోల గురించి చెప్పాల్సిన పనిలేదు. సాధారణంగా ఆటోలో తరలించాల్సింది ఆరుగురిని మాత్రమే. అయితే 15 మంది వరకు తీసుకెళుతున్నారు. దీంతో ప్రమాదాలు జరిగి భారీగా ప్రాణ నష్టం వాటిల్లుతోంది. ద్విచక్ర వాహనాల ప్రమాదాల్లో మృతి చెందుతున్న వారు ఎక్కువగా 22 ఏళ్ల లోపు వారు ఉంటే ఆటోల్లో ఎక్కుగా ప్రమాదానికి గురై చనిపోతున్నది పేదలు, కూలీలు కావడం గమనార్హం.


తెల్లవారు జామునే ఘటనలు..

పెద్ద పెద్ద ఘటనలు ఎప్పుడూ తెల్లవారు జామున 4 గంటలలోపే జరుగుతున్నాయి. ఇందుకు ప్రధానంగా డ్రైవర్లు నిద్రలేమితో ఉండటమే కారణమని వెల్లడైంది. లారీ డ్రైవర్లు రోజుల తరబడి డ్రైవింగ్ చేస్తూ ప్రమాదాలకు గురవుతున్నారు. ద్విచక్ర వాహనదారులు మితి మీరిన స్పీడు కారణంగా ప్రమాదాల్లో చిక్కుకుంటున్నారు.

నాలుగేళ్లలో జిల్లాలో జరిగిన ప్రమాదాలు ఇలా..

సంవత్సరం	ప్రమాదాలు	మృతులు	క్షతగాత్రులు
2021	861	368	949
2022	801	403	837
2023	631	372	730
2024	361	173	388
(నవంబర్ వరకు)			

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి



ప్రతి వాహనదారుడు ప్రభుత్వం సూచించిన రోడ్డు భద్రత నియమాలను పాటించడం ద్వారా ప్రమాదాలను అరికట్టవచ్చు. అయితే వాహనాల డ్రైవర్లు అతివేగం, ఓవర్‌లోడు కారణంగానే ప్రమాదాలు జరుగుతున్నాయి. డ్రైవింగ్ లైసెన్స్‌లు లేకుండా వాహనాలను నడపడం నేరం. ఓవర్ లోడుతో వెళుతున్న వాహనాలు, అతివేగంతో వెళుతున్న వాహనాలను తనిఖీ చేసి కేసులు నమోదు చేస్తున్నాం.

- చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా ఉప రవాణాశాఖ కమిషనర్, వైఎస్ఆర్ జిల్లా